సాక్షి
తిరుపతి
శనివారం। 27। మే। 2023



పంక్చర్ వేయిస్తుండగా..
పాకాల మండలం, కోనప్పరెడ్డిపల్లె వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు.
- 10లో



బిందు..రైతు బంధు
సూక్ష్మసేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేందుకు సహకారం అందిస్తోంది.
- 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	28
చిత్తూరు	38	27
తిరుమల	35	24
గూడూరు	42	30
నగరి	41	28

న్యూస్‌రీల్

సప్లిమెంటరీ పరీక్షకు 1,582 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్, బోటని, సివిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 122 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు ప్రథమ, ద్వితీయ సంవత్సర జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 28,536 మంది హాజరు కావాల్సి ఉండగా.. వారిలో 1,582 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ రమేష్ తెలిపారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర అబ్జర్వర్ ప్రద్యుమ్న

తిరుపతి అర్బన్: నగరంలో ఈనెల 28 ఆదివారం జరగనున్న యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షలకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర అబ్జర్వర్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యూపీఎస్సీ కేంద్ర అధికారి ప్రదీప్‌కుమార్, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రద్యుమ్న అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ యూపీఎస్సీ ప్రిలిమ్స్ 2023 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. తిరుపతి ఆర్డీఓ కనకనరసారెడ్డిని ప్రశ్న పత్రాల కస్టోడియన్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలో 6,333 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. మొత్తం 13 సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఉండదన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ రేపు

పుంగనూరు : జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలకు పట్టణంలోని ఉర్దూ స్కూల్‌లో ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అలాగే హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొననున్నట్లు వివరించారు.

భలే అల్లకం!



మంచాన్ని పరిశీలిస్తున్న నేదురుమల్లి

సైదాపురం : అరే మంచం భలే ఉందిలే. ఇలాగా కూడా అల్లుకోవచ్చా..? అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన సైదాపురం మండలం, వేములచేడు పంచాయతీలో పర్యటించారు. ఈసందర్భంగా రుద్రరాజు వెంకటేశ్వర్లు డ్రిప్ వైర్లుతో అల్లిన మంచం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ భాస్కర్ ఉన్నారు.

ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్



డీఈఓకు ఆప్షన్ ఫారమ్ అందిస్తున్న ఉపాధ్యాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఉపాధ్యాయులకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ గణితం సబ్జెక్టులో 21 మంది టీచర్లు పలు పాఠశాలలను కోరుకున్నారని, మిగిలిన సబ్జెక్టులకు సంబంధించి అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని వెల్లడించారు.

ప్రాజెక్టుల జోలికొస్తే సహించం

పుంగనూరు : తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజవర్గాలకు తాగు, సాగు నీరు అందించేందుకు నిర్మిస్తున్న ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులను చంద్రబాబు అడ్డుకుంటే సహించే ప్రసక్తే లేదేని పుంగనూరు వాసులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో ర్యాలీ నిర్వహించి, ఇందిరా సర్కిల్ వద్ద ధర్నాకు దిగారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జానపద కళల సంస్థ అధ్యక్షుడు కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

సంప్రదాయాన్ని పాటిస్తూ.. అర్చకులుగా 'రాణి'స్తూ..!

అవనిలో సగం.. ఆకాశంలో సగం.. ఏ రంగంలోనైనా రాణిస్తాం.. అని నిరూపిస్తున్నారు నేటి నారీమణులు. ఒకప్పుడు వంటింటి కుందేళ్లుగా అణచివేతకు గురైన మహిళలు ఇప్పుడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ 'మేము సైతం' అంటూ దూసుకుపోతున్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని అందిపుచ్చుకుని అర్చకత్వంలోనూ రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో శుభకార్యాలు చేస్తూ విశిష్ట గౌరవాన్ని సంపాదించుకుంటున్నారు. ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.. పిచ్చాటూరు మండలం, కీళ్లపూడి గ్రామానికి చెందిన మహిళా అర్చకులు.

కీళ్లపూడిలో గృహ ప్రవేశ కార్యక్రమంలో అర్చకులుగా కల్పన



జలకంఠేశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకురాలు నాగవేణి



- అర్చకులుగా తల్లి, కుమార్తె, మనవరాలు
- ఆలయాలతో పాటు శుభకార్యాలకు అర్చకత్వం
- ఏ రంగంలోనూ తీసిపోమంటున్న బ్రాహ్మణ కుటుంబం
- మూడు దశాబ్దాల సంప్రదాయం

సాక్షి, తిరుపతి డెస్క్

పిచ్చాటూరు మండలం, కీళపూడిలో శ్రీభవానీదేవి సమేత జలకంఠేశ్వరాలయం, శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాలతో పాటు, పిచ్చాటూరులోని శ్రీనాగాలమ్మ దేవాలయాల్లో నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. ఆయా ఆలయాల్లో కీళ్లపూడి గ్రామానికి చెందిన మహిళా అర్చకులే పూజలు చేస్తుంటారు. పురాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు.

1993 నుంచి నిత్య పూజలు

1990లో అరణియార్ జలాశయం మధ్యలో కీళపూడి గ్రామానికి చెందిన హరిశ్చంద్ర రాజు పొలాన్ని దున్నుతుండగా శివలింగం బయటపడింది. ఈ శివలింగాన్ని ప్రాజెక్టు ఒడ్డున ఓ రావి చెట్టు కిందకు తరలించారు. మూడేళ్ల తర్వాత ఆ చెట్టు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అరణియార్ ప్రాజెక్టు జలం(నీరు) కింద శివలింగం లభించినందున శ్రీ భవానీ దేవి సమేత జలకంఠేశ్వర స్వామిగా నామకరణం చేశారు. ఇలా ఏర్పడ్డ ఈ ఆలయంలో నిత్యపూజలకు అదే గ్రామంలోని ఓ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సరోజమ్మను అర్చకురాలిగా నియమించారు. అలా మొదలైన ఈ అర్చకత్వం తన భర్త బతికి ఉన్న సమయంలో ఆయన ద్వారా అర్చకత్వం అభ్యసించారు. సరోజమ్మ తన పౌరోహిత పటిమతో ఆలయ అభివృద్ధికి తోడ్పడారు. ఆ సమయంలో ఆమెకు ఏడేళ్ల వయస్సు గల మనవడు సుబ్రమణ్యం, ఎనిమిదేళ్ల వయస్సు ఉన్న మనవరాలు కల్పన పూజలకు సహకరించేవారు. 2013లో మనవరాలు కల్పనకు వివాహం జరిగింది. 2014లో సరోజమ్మ కుమార్తె నాగమణి నాగమణి సైతం తల్లితో కలిసి జలకంఠేశ్వర స్వామి ఆలయంలో నిత్యపూజల్లో పాల్గొంటూ అర్చకత్వం వైపు అడుగులు వేశారు. మనవరాలు కల్పన 2015లో తన భర్తతో కలిసి కీళపూడికి విచ్చేసి ఇక్కడే కాపురం పెట్టారు. ఆపై వృద్ధాప్యం కారణంగా 2017లో సరోజమ్మ శివైక్యం చెందారు. అప్పటి నుంచి తన మేనత్త నాగమణి, కోడలు కల్పన జలకంఠేశ్వర ఆలయంలో అర్చక స్వాములయ్యారు. తదనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా షిర్డీ సాయిబాబా ఆలయాన్ని కూడా నిర్మించారు.



అభయాంజనేయ స్వామి ఆలయంలో ..



కుంభాభిషేకంలో మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతూ..

ఆధ్యాత్మిక 'కల్పన'

అదే గ్రామానికి చెందిన వెంకట్రాజు రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్. ఉద్యోగ విరమణతో వచ్చిన రూ.9 లక్షల పాటు దాతల విరాళంతో 2019లో శివాలయం పక్కనే శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో అర్చకత్వ బాధ్యతలను కల్పనకు అప్పజెప్పారు. 2020లో పిచ్చాటూరు టీచర్స్ కాలనీ సమీపంలో స్వయంభు శ్రీ నాగాలమ్మ ఆలయం నిర్మించగా.. అందులోనూ ఆమెనే అర్చకులుగా నియమించారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో కల్పన అర్చకులుగా నిత్య పూజలు చేస్తుండగా, శ్రీ జలకంఠేశ్వరాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో నాగమణి అర్చకత్వం వహిస్తున్నారు.

అభివృద్ధి పథంలో ఆలయాలు

మహిళా అర్చకులుగా ఉన్న ఆలయాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. సెంటు భూమిలో రేకుల షెడ్డులో ప్రారంభమైన కీళపూడిలోని శ్రీ జలకంఠేశ్వర ఆలయం ప్రస్తుతం సుమారు ఎకరం విస్తీర్ణంలో శివాలయంతో పాటు షిర్డీ సాయిబాబా ఆలయం, అనుబంధంగా ఓ కల్యాణ మండపం రూపుదిద్దుకుంది. ఆలయ సత్రంలో వివాహాలు, శుభకార్యాలు, తిరుమల యాత్రికులు సేద తీరడానికి విడిదిగా ఉపయోగపడుతోంది. పక్కనే ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం మండలం ప్రారంభంలో, రోడ్డుకు ఆనుకొని ఉంది. ఈ కారణంగా భక్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు ఇక్కడ ఆపి పూజలు చేసి వెళ్తుంటారు. ఇక నాగమ్మ ఆలయ కుంభాభిషేకానికి గత నెల రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు.

శుభకార్యాలకు అర్చకత్వం

ఆలయాల ద్వారా సుపరిచితులైన కల్పనను గృహ ప్రవేశాలు, సత్యనారాయణ వ్రతం, గణపతి హోమం వంటి పూజలకు ఆహ్వానిస్తుంటారు. వీటితో పాటు పెళ్లిళ్లు సైతం జరిపిస్తుంటారు.

అందరి ప్రోత్సాహం వల్లే



నా భర్తతో పాటు అందరి సహకారం వల్లే అర్చకత్వంపై ఆసక్తి పెరిగింది. దేవునిపై భక్తి శ్రద్ధలతో చేసే పని ఏదైనా నిష్టతో చేయాలన్నదే మా పెద్దలు నాకు నేర్పించారు. స్వామి వారి సేవలో అర్చకురాలిగా కొనసాగడం దేవుడు ఇచ్చిన వరం. రుతుక్రమం సమయంలో ఆలయానికి, అర్చకత్వానికి దూరంగా ఉంటా. గత ఏడేళ్లుగా గృహ ప్రవేశాలు, గణపతి హోమం, సత్యనారాయణ వ్రతం, ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవాలకు వెళ్తున్నా.

-కల్పన, అర్చకురాలు, కీళపూడి గ్రామం

అమ్మ అర్చకత్వాన్ని కొనసాగిస్తా



మా అమ్మ సరోజమ్మ నాకు అప్పజెప్పిన అర్చకత్వాన్ని నా చివరి జీవితం వరకు కొనసాగిస్తాను. శ్రీ జలకంఠేశ్వర స్వామికి సేవచేస్తూ, ఆలయానికి వచ్చే భక్తులకు సేవలందిస్తా. ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

-నాగమణి, అర్చకురాలు, కీళపూడి

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

తిరుపతి అర్బన్: జగనన్నకు చెబుదాం అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రాధాన్యత అంశాలైన స్పందన, జగనన్నకు చెబుదాం, నాడు-నేడు, హెల్త్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, గ్రామ, వార్డు సచివాలయం, గడపగడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై కలెక్టర్‌తోపాటు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా మనబడి నాడు–నేడు పాఠశాలల మరమ్మత్తులు, నాణ్యమైన వసతులు కల్పించాలని చెప్పారు. వ్యాధులకు సంబంధించి ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు. జూన్ 12వ తేదీ పాఠశాల ప్రారంభం నాటికి జగనన్న కిట్ పిల్లలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖకు 77 ఫిర్యాదులు అందాయని.. అందులో 58 పరిష్కారమయ్యాయని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ వెంకట్రావు, ఆర్డీఓలు రామారావు, కిరణ్‌కుమార్, చంద్రమునిరణాల్, జిల్లా ప్లానింగ్ అధికారి అశోక్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ విజయకుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్‌నారాయణ, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, డీఎల్డీఓలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

బ్రహ్మోత్సవం.. ఆరంభం



ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం 8.22 నుంచి 8.49 గంటల మధ్య మిథున లగ్నంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ధ్వజావరోహనాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం శ్రీవారి ఆస్థానం ఘనంగా చేపట్టారు. అంతకుముందు గోవిందరాజస్వామి, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామ వారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి పెద్దశేష వాహన సేవ వేడుకగా చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజస్వామి పెద్దశేష వాహనంపై కొలువై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టీటీడీ పెద్దజీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి, కంకణ భట్టార్ ఏపీ.శ్రీనివాస దీక్షితులు, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.



ధ్వజపటం ఎగురవేస్తున్న అర్చకులు

సొంతింటి కల సాకారం

- 30 ఏళ్ల తర్వాత నెరవేరిన వైనం
- 47 మంది పేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇంటి పట్టాల పంపిణీ

రేణిగుంట: సొంతింటి కల నెరవేరింది. 30 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు గ్రామంలో గూడులేని పేదలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 47 మంది పేదలను గుర్తించి ఇంటి పట్టాలు అందించారు. 2019 ఎన్నికల సందర్భంగా స్థానికులకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పేదలకు ఇంటి పట్టాలు అందజేశారు. 'నియోజకవర్గ అభివృద్ధి కోసం మళ్లీ మీ వెంటే మేముంటాం' అంటూ ఎమ్మెల్యే చిత్రంతో కూడిన జ్ఞాపికను మహిళలు ఎమ్మెల్యేకు బహూకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30 ఏళ్లు పాలించిన వ్యక్తులు ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. రికార్డు స్థాయి మెజారిటీతో తనను గెలిపించిన ప్రజల సంక్షేమం కోసం శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజలు నేరుగా తమ సమస్యలను చెప్పుకుని పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేరుగా తనకే ఫోన్ చేయవచ్చని ఆయన సూచించారు. తహసీల్దార్ రూప్‌చంద్, సర్పంచ్ నాగరాజు, పాపయ్య, గోపి, రాధాకృష్ణయ్య, బాలకృష్ణ, రామ్, రాఘవేంద్ర, కోవి చంద్రయ్యానాయుడు, బాలాజీప్రసాద్‌రెడ్డి, రవి, మునిశేఖర్, మల్లీ మొదలియార్, పోలి గుణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటిపట్టాలు అందుకున్న లబ్ధిదారులతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

పనసకోన శివలింగానికి సంప్రోక్షణ



పనసకోనలోని శివలింగానికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

తొట్టంబేడు(రేణిగుంట): పనసకోనలోని శివలింగాన్ని సంప్రోక్షణ కోసం శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి తరలించారు. దక్షిణ కైలాసగిరుల్లో పురాణ ప్రసిద్ధి చెందిన హరహర తీర్థం(పనసకోన)లో ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం శివలింగాన్ని పెకలించిన విషయం తెల్సిందే. దీనిపై ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు శుక్రవారం సాయంత్రం ఆ ప్రాంతానికి వెళ్లి శివలింగాన్ని స్వాధీనం చేసుకొని శ్రీకాళహస్తీశ్వరాలయానికి తరలించారు. ఆలయ ఆవరణలోని శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఉంచి సంప్రోక్షణ పూజలు చేసి తదుపరి ప్రతిష్ఠించనున్నారు. చైర్మన్ మాట్లాడుతూ హరహర తీర్థంలో యుద్ధ ప్రతిపాదికన ఆలయాన్ని పునఃనిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ ఏఈఓ లోకేష్‌రెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, అనుబంధ ఆలయాల అధికారులు లక్ష్మయ్య, స్థపతి కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, వేద పండితులు రాజేష్‌శర్మ, అర్చకులు గోవింద్‌శర్మ పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

తిరుపతి కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు చెస్‌ఆటను నేర్పించడమే తమ లక్ష్యమని డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్, చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర స్థాయి సీనియర్ చదరంగం పోటీలు శుక్రవారం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ.శర్మ, వైస్ చైర్మన్ డాక్టర్ దివాకర్ రెడ్డి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్‌లో తిరుపతి జిల్లాకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు వచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులకు రూ.25 వేలు, ద్వితీయ స్థానం క్రీడాకారులకు రూ.15వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని, మిలిగిలిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేకేవీ.శర్మ పోటీలను ప్రారంభించి మొదటగా డాలర్స్ దివాకర్‌రెడ్డితో తలపడ్డారు. జిల్లా అసోసియేషన్ నాయకులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న దివాకర్‌రెడ్డి, శర్మ

కాడంబా..అదిరిందబ్బా!

ఖండాంతర దేశాలలో దర్శనమిచ్చే ఆకర్షణీయమైన కాడంబా పుష్పం ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో కనువిందు చేస్తోంది. నియోలామార్కియా కాడంబా శాస్త్రీయ నామం కలిగిన ఈ పుష్పం ప్రధానంగా దక్షిణ ఆసియా దేశాల్లో మాత్రమే ఉంటుంది. ఈ మొక్కను తిరుపతికి సమీపంలో ఉన్న తిరుమల నగరంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో నాటారు. ఆ చెట్టు పుష్పించి ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. సేద్యంలో వినూత్న విధానాలను ప్రవేశపెడుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని రైతులు సులువుగా సాగు చేసే దిశగా ప్రోత్సాహం అందిస్తోంది. అందులో భాగంగా బిందు పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తోంది. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేలా సహకారం అందిస్తోంది. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతాంగానికి మరింత ఎక్కువ సబ్సిడీపై డ్రిప్ సామగ్రిని అందుబాటులోకి తీసుకువచ్చింది. అన్నదాతల అవసరాలకు తగ్గట్టు 5వేల నుంచి 10వేల ఎకరాలకు బిందు సేద్యం పరికరాలను అందజేయాలని లక్ష్యాలను నిర్దేశించింది.

- సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- రాయితీపై డ్రిప్ పరికరాలు.. స్ప్రింక్లర్లు
- తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేందుకు సహకారం
- దరఖాస్తు చేసుకున్నవారందరికీ పంపిణీ చేసేందుకు సన్నాహాలు



‘బిందు’.. రైతు బంధు

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. రైతు భరోసా, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ, సబ్సిడీ విత్తనాలు, పరికరాలు, ఎరువులు అందించడమే కాకుండా గిట్టుబాటు ధరలకు పంటల కొనుగోలు చేస్తోంది. అలాగే తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగుచేసేందుకు డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తోంది. డ్రిప్(బిందు) సేద్యం ,స్ప్రింక్లర్లు(తుంపర్లు)సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే మెట్ట ప్రాంత రైతులకు బిందు సేద్య పరికరాలను భారీ రాయితీపై అందిస్తోంది. 2022-23లో 3,750 ఎకరాలకు డ్రిప్ పరికరాలను అందించాలని లక్ష్యం పెట్టుకోగా, 4,032 ఎకరాలకు అందజేశారు. దీంతో 1,452 మంది రైతులు లబ్ధిపొందారు. రాయితీ రూపంలో ప్రభుత్వం రూ.10 కోట్లు వెచ్చించింది. 2023-24కు సంబంధించి 5వేల ఎకరాలకు గాను 2వేల మంది రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణి చేయాలని జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్‌కు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. సుమారు రూ.12 కోట్ల నుంచి రూ.15కోట్ల సబ్సిడీపై రైతులకు అందించాలని ఆదేశించింది.అలాగే అన్నదాతలు డ్రిప్ సామగ్రి కోసం దరఖాస్తు చేసుకుని ఉంటే మరో 5వేల ఎకరాలకు సైతం పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు మొత్తం 10వేల ఎకరాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు సన్న, చిన్నకారు రైతులు బిందు సేద్యంపై ఆసక్తి చూపుతున్నారు. బీడు భూములు సైతం సాగులోకి తీసుకు రావడానికి ముందుకు వస్తున్నారు.

పలు ప్రయోజనాలు

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయడానికి బిందు సేద్యం దోహదపడుతుంది. బిందువుల రూపంలో నీటిని అందించడంతో కలుపు సమస్య ఉండదు. అంతే కాకుండా కూలి ఖర్చు తగ్గుతుంది. నీరు, గాలి, పోషకాలు ఎల్లప్పుడూ సమపాళ్లలో అందడం వల్ల మొక్క ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి అందిస్తోంది. విద్యుత్, నీరు, ఎరువులు ఆదా అవుతుంది. పంట ఉత్పాదకత, దిగుబడి పెరుగుతుంది. పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. అంతర పంటల సేద్యం పెద్దగా ఉండదు. ఇలా రైతులకు పలు ప్రయోజనాలు ఉంటాయి. ముఖ్యంగా బత్తాయి, మామిడి, నిమ్మ, సపోటా, అరటి, మిరప, ఆయిల్ ఫామ్, చెరుకు, మల్బరీ తదితర పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో ఉపయోగపడుతుంది.

రాయితీలు ఇలా..

డ్రిప్ పరికరాలకు సంబంధించి 5 ఎకరాల లోపు సన్న,చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ లభిస్తోంది. 8 ఎకరాల పైన 10 ఎకరాల లోపు ఉన్నవారికి 70శాతం రాయితీ ఉంటుంది. స్ప్రింకర్లు అయితే 5 ఏకరాలలోపు సన్న చిన్న కారు రైతులకు 50 శాతం రాయితీతో, 5 నుంచి 10 ఎకరాలలోపువారికి 45 శాతం రాయితీపై అందిస్తున్నారు. బిందు, స్ప్రింక్లర్లు పరికరాల పై రాయితీ పొందడానికి రైతులు 1బీ రికార్డుతో రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి పెరిగింది



నేను 2.6 ఎకరాల్లో పచ్చిమిర్చి సాగుచేశా. గతంలో నీటి కొరత కారణంగా దిగుబడి సరిగా ఉండేది కాదు. ఈ తరుణంలో వలంటీర్ ద్వారా రైతు భరోసా కేంద్రంలో డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకున్నా. రూ.25,570 చెల్లించాను. ప్రభుత్వం 90శాతం రాయితీతో రూ.1,37,068 విలువైన డ్రిప్ పరికరాలను అందించింది. ఇప్పుడు పచ్చిమిర్చి దిగుబడి బాగా పెరిగింది. గతంలో ఈ స్థాయిలో ఎవరూ రైతులకు సాయం చేయలేదు.

– సురేంద్రరెడ్డి, రైతు, బుచ్చినాయుడుకండ్రిగ

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నేను 0.48 ఎకరాల్లో దోసకాయ సాగు చేస్తున్నా. బిందు సేద్యం పరికరాల కోసం ఆర్బీకేలో దరఖాసుత చేసుకున్నా. కేవలం రూ.26,860 చెల్లిస్తే 90శాతం సబ్సిడీపై ప్రభుత్వం రూ.84,014 విలువైన డ్రిప్ పరికరాలను మంజూరు చేసింది. బిందు సేద్యంతో ఎరువుల వాడకం, కలుపు సమస్య పూర్తిగా తగ్గింది. మంచి దిగుబడి వస్తోంది. రైతు సంక్షేమ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మునస్వామి, రైతు, మునిలిపేడు, ఏర్పేడు

నీటి సమస్య తీరింది



నేను 2.30 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు డ్రిప్ సామగ్రికి దరఖాస్తు చేసుకున్నా. 90 శాతం సబ్సిడీ పోగా, రూ.21,851 చెల్లించా. ప్రభుత్వం నాకు రూ. 92,762 విలువైన డ్రిప్ పరికరాలు మంజూరు చేసింది. గతంలో నీటి కొరత కారణంగా దిగుబడి తక్కువగా ఉండేది. బిందు సేద్యంతో ముందు నీటి సమస్య తీరింది. తక్కువ నీటితోనే అధిక దిగుబడి వస్తోంది. ఆదాయం గణనీయంగా పెరిగింది.

– జయరామయ్య, రైతు, చిల్లకూరు మండలం

పకడ్బందీ కసరత్తు



అన్నదాతకు అండగా ఉంటాం. ప్రభుత్వం సైతం ఈ విషయంలో స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. నీటి కొరతను అధిగమించేందుకు బిందు సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. రాయితీపై రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తోంది. గత ఏడాది మాకు నిర్దేశించిన లక్ష్యాన్ని మించి బిందు సామగ్రిని అందించాం. ఈ ఏడాది కూడా టార్గెట్‌ను దాటుతాం. ఈ దిశగా రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేసేందుకు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నాం.

– సతీష్, జిల్లా సూక్ష్మ నీటి సేద్యఅధికారి, తిరుపతి

అర్హులందరికీ అందిస్తాం



అర్హులైన ప్రతి రైతుకు రాయితీపై డ్రిప్ పరికారలు, స్ప్రింకర్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. గత ఏడాదిలోను ఆసక్తి చూపినవారందరికీ అందజేశాం. ఈ ఏడాది అదే విధంగా పంపిణీ చేస్తాం. ప్రధానంగా జిల్లాలో పంట దిగుబడికి నీటి కొరత రాకూడదు, నీరు వృథా కాకూడదు అనే ఉద్దేశంతోనే ముందుకు వెళుతున్నాం. రైతులు అందరూ బిందు పరికరాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు పొందాలి.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,990
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,567

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,500
రిటైల్ వెండి గ్రాము	రూ.74.50

గొడ్డేటి వాగులో పడి వృద్ధురాలి మృతి

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి గొడ్డేటి వాగులో మహిళ మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వాగుకు చేరుకున్న పోలీసులు పక్క గ్రామమైన చెంచురాజు కండ్రిగకు చెందిన మన్నే సమ్మ(70)గా గుర్తించారు. బంధువులకు సమాచారం చేరవేశారు. మన్నేసమ్మకు మతిస్థిమితం లేదని ఆమె కుమార్తె వెల్లడించారు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన మన్నేసమ్మ తిరిగి ఇంటికి రాలేదని బంధువులు తెలిపారు. రెండు రోజుల క్రితం మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

సకాలంలో రుణాలు అందించండి

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పథకాలకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఎల్డీఎం సుభాష్, ఆర్బీఐ ఎల్డిఓ పూర్ణిమ, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రుణాలు 131 శాతం సాధించి రాష్ట్రంలో ముందంజలో ఉన్నట్టు వెల్లడించారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.19,286 కోట్లుగా ఉందన్నారు. ఆ మేరకు బుక్‌లెట్‌ను బ్యాంకర్లతో కలిసి విడుదల చేశారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రభుదర్, ఇండియన్ బ్యాంక్ డీజీఎం సెల్వరాజ్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ జైకుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, డీఆర్డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

రేపు అండర్-19 బాయ్స్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలగుంటలోని వైఎస్సార్ గ్రౌండ్స్‌లో అండర్-19 బాయ్స్ జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నారు. ఆ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికకు 01-09-2004 నుంచి 01-09-2007 మధ్యలో జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 8 గంటలకు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో పాటు ఆధార్‌కార్డు, ఫాం 5 జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్క్సులిస్ట్ జిరాక్స్ కాపీతో హాజరవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98490 26131, 79818 80381 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

AUTOMOBILES

VEHICLE FOR SALE

■ **Super Cars:** Buying and Selling: Park N Sale. Swift Dezire-19, Baleno-17, Ciaz-16,19, Bolero-16, Innova-05,12,14, Alto-12,14. ✆ 9030100111.

Education

■Govt.బోర్డు 10th /ఇంటర్ పరీక్షలు July -23 (Already failed) వారికి, Oct-23 పరీక్షలు అందరికి Passకచ్చితం లేదా Fee వాపస్. ఫోన్: 85507 00116

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

ONE SITTING

■ Direct 10th, Inter one Sitting, B.A, B.Com, B.Sc, BBA, B.Tech, M.A, M.Com, M.Sc, MBA, MCA, Distance Education, Tirupati, 7416478396, 7416478395.

PARAMEDICAL

■B.Sc Nursing, BPT & Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati. 7416478396, 7416478395.

SPOKEN ENGLISH

■మీకు ఇంగ్లీష్, హిందీ ఒకే ఒక నెలలో నేర్పించగలము. స్త్రీలకు 8919194913 స్త్రీలు& పురుషులు ఎవరికైనా 9951774479. కోచింగ్ మీ ఇల్లు/ఆఫీసు వద్ద ఇవ్వబడును. ఆన్‌లైన్ Zoom కలదు.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
Contact
9705444178
951602970

Real Estate

FLATS FOR SALE

■Ready to Occupy all 3 BHK Luxury Apartments Flats for Sale in Vidhaya nagar Colony & Lakshmipuram Colony, Tirupati, ✆ 970328 3387.

LEASE/RENT

■తిరుపతి, లీలామహల్ ఫిష్ మార్కెట్ దగ్గర ఆఫీసులకు/బ్యాంకులకు కోచింగ్ సెంటర్లకు పార్కింగ్ లిఫ్ట్‌తో అనుకూలమైన మొదటి అంతస్తు లీజుకు అద్దెకు కలదు. ✆ 90149 88778, 88860 86459

PLOTS FOR SALE

■తిరుపతిరూరల్ బ్రాహ్మణపట్టు(వేమూరు గ్రూపు)రోడ్డుప్రక్కనతుడాఅప్రూవుడ్ ప్లాట్60(66x30)&61(66x47),1500Sqftలాండ్ మార్క్‌ప్రసన్న రంగనాథస్వామిగుడి-పూడిరోడ్డు.9848542570.

■తిరుపతి హైవేలకు అనుకొని 12వేల నుండి 50వేల వరకు అన్ని సదుపాయాలతో ఫైనల్ అప్రూవ్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ డైరెక్ట్ ఓనర్, ✆9502774175, 7995992114.

TO-LET

■తిరుపతి, మిట్ట వీధిలో గ్రౌండ్ ఫ్లోర్ 225 Sft షాపుకు 2ndఫ్లోరులో 1069Sft ఆఫీస్ / గోడౌన్ లకు అద్దెకు ఇవ్వబడును. ✆ 9442305754, 9441574085.

■To-Let. 3 Bed Room New Portion in Second Floor Individual House having Lift and all Amenities, Rent: 27,000 (Negotiable) @ Irla Nagar, Near South India Shopping Mall, Tirupati, ✆ 98490 47477.

WANTED

■ స్థలం కావలెను: సమాజసేవా కార్యక్రమాల నిర్వహణకు, పేరింగ్ ప్రాతిపదికన భవన నిర్మాణానికి తిరుపతి టౌన్‌లో స్థలం కావలెను. ✆ 8639299810

HEALTH CARE

DIABETOLOGIST

■ డా॥ డి.యస్.రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్, షుగర్, థైరాయిడ్, బి.పి, జ్వరాలు, అత్యాధునిక ల్యాబొరేటరి, ఇ.సి.జి, పాదముల పరీక్షలు కలవు. డి.యస్.ఆర్.డయాబెటీస్ సెంటర్, అన్నమయ్య సర్కిల్, R.C.రోడ్, తిరుపతి, 0877-2241071.

MARRIAGE SERVICES

వధువు కావలెను

■హిందూ వెల్మ/ 40సం హార్డ్‌వేర్/ జీతం: 85వేలు, వయస్సు 10/12 చదివిన మంచి ప్రవర్తన 30-35సం॥ హిందూ వధువు కావలెను. పారంపర వ్యక్తియై వైష్ణవ దేవారిక ప్రాధాన్యత. ఫోన్ 8838469992

వరుడు కావలెను

■ యాదవ 30Yrs/5'.5"/B.Tech/Well Settled Working వధువుకి తగిన వరుడు కావలెను. సంప్రదించండి సెల్: 96765 54994.

Wanted

■ తిరుపతి నందు ఇంట్లోనే ఉంటూ ఇద్దరు మనుషులకు ఇంటిపని వంటపని చేయుటకు ఏ బాదరబందీలేని ఆడ మనిషి కావలెను. వ: 35సం.-45 సం. మధ్య. 8978815187, 9966385022.

■తిరుపతి పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 9000 నుండి 12000. సంప్ర: 8688561831, 8125223207

■తిరుపతి బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూంలో ఆఫీస్ బాయ్స్,ప్యాకింగ్‌చేయుటకు,జీ:12,500,PF, ESI, ఫీల్డ్‌ఆఫీసర్‌జీ:15,000,కంప్యూటర్‌పరిజ్ఞానంకల్గిన స్త్రీలుకావలెను. 7396016024, 8904040900.

■తిరుపతిలోప్రముఖ సంస్థలోASOగాఅనుభవం వారుకావలెను.జీ:18,000,PF,ESIకలదు, సెక్యూరిటీ గార్డ్స్‌గా స్త్రీలు/పు లు కావలెను. డ్యూటీ 12గం.,జీ:14,000.9951393311, 9247124630.

■ Wanted Pre Primary Teachers for reputed School in Tirupati. Interested Candidates can apply. ✆ 8466-062300, +9172078 41807.

■**Wanted Teachers**, Hindi, English, Social, Computer and Mother Teachers with B.Ed Qualification and Experience, Academic Incharge with Good Commnication Skills and PET Teacher. Sri NRI E.M.High School Tiruchanoor. 9951055577, 8121550135.

■**Manager / Receptionist** (3 Years Experience) to a lodges in Tirupati having 40 rooms, day by day duty + Good Salary + Insentive + Meals ✆ 8333071020

■చిత్తూరు,తిరుపతి APSRTC బస్టాండ్ నందు పనిచేయుటకు అనుభవము కల్గిన ఎలక్ట్రీషియన్ కావలెను జీతం: 12,000/- తిరుపతి వారికి ప్రాధాన్యత సంప్ర: 7569245777

■Wanted Chemistry, Maths, English, Commerce, Sanskrit, Civics, Botany Junior Lecturers, Puttur, Send Resume to whatsapp: 9573810525, 9121122874.

■సీనియర్ సివిల్ / Construction ఇంజనీర్ కావలెను. కనీసం 10 సం. అనుభవము కల్గి, CAD డ్రాయింగ్స్ గీయ గలిగిన ఇంజనీరు తిరుపతిలో పనిచేయుటకు కావలెను. ✆ 90000 95333.

■**Wanted Teachers** for K.G.Teacher-1, Primary English-1, Primary Science or EVS-1, Higher English-1, Higher Social-1, Higher Biology-1, Computers and PET. Note: Fluency in English is must. (Interview Time 10 A.M to 1 P.M). ✆ 90307 20279.

■తిరుమలకువిద్యుత్ బస్సులను నడుపుటకు డ్రైవర్లు కావలెను.Q:హెవీలైసెన్స్(18నెలలునిండిన)8thపాస్, తిరుపతి,శ్రీకాళహస్తి, పుత్తూరు స్థానికులు మాత్రమే. Yasaswi Service. 7396599952, 7396599954.

■ఎలక్ట్రికల్ రంగంలో చిత్తూరు జిల్లా చుట్టు పక్కల మండలాలలో పని చేయుటకు అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. Off: డిగ్రీ మరియు డైరీ సైన్స్. సెల్: 76720 36839, 0861-3563368.

■ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684

■బెంగుళూరు బాణసవాడిలో ఇంట్లో వంట పని ఇంటి పని వెజ్ & నాన్ వెజ్ చేయుటకు మహిళ కావలెను. జీతం: 18,000, ఉచిత భోజనం+వసతి కలదు. ఫోన్:8902817855.

■ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి మాత్రమే ఫ్రాంచైజ్ ఇవ్వబడును. Mega Group Man Power & Security. Cont : 7032610569, 7093125169.

■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50నిమిషాలు పంపుతూ వారానికి 3500/-సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520.

■VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995374999

■ప్రముఖ కంపెనీ శ్రీశంకర్ సిల్క్స్‌కు చిత్తూరు నుండి సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ గా పనిచేయుటకు కావలెను. అర్హత 10+ (ఉ॥ 10గం-సా॥ 7 గం.) సంప్ర: 9121234705

గమనిక

సాక్షి తరఫున దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని ఏ రకంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుళికలు తిని మహిళ మృతి

చిల్లకూరు: మండలంలోని కలవకొండ పంచాయతీ, బెస్తపాళెం సమీపంలో రొయ్యల గుంతల వద్ద కాపాల ఉన్న భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా భార్య విషపుగుళికలు తిని మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వాకాడు మండలం. బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన కోటయ్యకు అదే మండలం, గూడలికి చెందిన చెంచమ్మతో ఆరేళ్ల క్రితం వివాహమయ్యింది. ఈ క్రమంలో వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవనం కోసమని బెస్తపాళెం వద్ద ఉన్న రొయ్యల గుంతల వద్ద కాపలా ఉంటున్నారు. శుక్రవారం కోటయ్య భార్యపై కోపగించుకోవడంతో ఆమె గుడిసెలోకి వెళ్లి గుళికలు తిని అపస్మారక స్థితికి చేరింది. స్థానికులు గుర్తించి వెంటనే ఆమెను చింతవరం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గూడూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. చిల్లకూరు తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ సమక్షంలో పంచనామ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డుపై పడి ఉన్న యువకులు

చిల్లకూరు: బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మండలంలోని చింతవరం గ్రామానికి వెళ్లి తిరిగి గూడూరుకు బయలుదేరారు. నాంచారమ్మపేట వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్‌పై బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురిలో ఇద్దరు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రయివేటు వాహనాల్లో నెల్లూరుకు తరలించారు. వారి పేర్లు, వివరాలు తెలియరాలేదు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



మీనా (ఫైల్)

భాకరాపేట : అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన మండలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం.. చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచెర్ల పంచాయతీ దాసరగూడెంకు చెందిన సుబ్రమణ్యం కుమార్తె మీనా(22) మూడు రోజులుగా కనబడక పోవడంతో తల్లిదండ్రులు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని కుంటలో నీటిపై తేలియడుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. భాకరాపేట పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దాసరగూడెంకు చెందిన మీనాగా గుర్తించారు. చికటి పడడంతో మృతదేహాన్ని వెలికితీయలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్ నాటికి రేణిగుంట- నాయుడుపేట ఎన్‌హెచ్ పూర్తి



సమీక్షిస్తున్న పీఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: వచ్చే డిసెంబర్ నాటికి రేణిగుంట-నాయుడుపేట జాతీయరహదారి పనులు పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితో పాటు జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా గూడూరు వరకు ఉందని, ఈ క్రమంలో పనుల నాణ్యతతోపాటు వేగవంతం చేయాలన్నారు. కృష్ణపట్నం పోర్ట్‌కు ప్రస్తుతం ఒక రహదారి మాత్రమే ఉందని 2, 3, 4 ప్యాకేజ్‌తో 4 రహదారులు రానున్నాయని వెల్లడించారు. గాజుల మండ్యం-చెన్నై రహదారి 6 లేన్ పనులు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి జేసీ శ్రీనివాసరావు, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్లు తిరుపతి-వెంకటేశ్వర్లు, నెల్లూరు-దేవేస్ గోయల్, ఆర్డీఓలు తిరుపతి-కనకనరసారెడ్డి, గూడూరు-కిరణ్‌కుమార్ సూళ్లూరుపేట-చంద్రముని పాల్గొన్నారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని నవ వధువు ఆత్మహత్య



మృతి చెందిన వైశాలి, వైశాలి (ఫైల్)

వరదయ్యపాళెం: బలవంతపు పెళ్లి ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. మనస్తాపానికి గురైన నవవధువు పెళ్లయిన 23 రోజులకే తనువు చాలించిన ఘటన మండలంలోని గోపాలరావు కాలనీలో విషాదాన్ని నింపింది. స్థానిక వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలరావు కాలనీకి చెందిన రాపూరు వైశాలి (17), తుపాకుల సుబ్రమణ్యం (19) రెండు కుటుంబాలు సమీప బంధువులు కావడంతో ఈ నెల 3వ తేదీన వివాహం జరిగింది. పెళ్లైన రోజు నుంచి వైశాలికి భర్త మీద సఖ్యత లేదు. అయితే భర్త సుబ్రమణ్యం శుక్రవారం ఉదయం ఓ ప్రైవేటు పరిశ్రమలో డ్యూటీకి వెళ్లి వచ్చే లోపు వైశాలి విషపు గుళికలు మింగినట్లుగా తెలిపింది. హుటాహుటిన వైద్యం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం వైశాలి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అయితే వీరిద్దరికీ మైనర్ తీరక ముందే వివాహం జరగడం గమనార్హం.

లారీని ఆపి పంక్చర్ వేయిస్తుండగా..

- వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ..
- ఒక డ్రైవర్ మృతి, మరొకరికి గాయాలు

పాకాల : మండలంలోని కోనప్పరెడ్డిపల్లె వద్ద రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతి చెందగా, మరో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా, త్రిపురారం మండలానికి చెందిన కిషన్ కుమారుడు డ్రైవర్ ముదావత్ లక్ష్మణ్(35) బియ్యం లోడు లారీతో మిరియాలగూడ నుంచి చిత్తూరుకు బయలుదేరాడు. మండల పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని కోనప్పరెడ్డిపల్లి వద్ద లారీ పంక్చర్ అయ్యింది. లారీని రోడ్డు పక్కగా ఆపి లక్ష్మణ్ పంక్చర్ వేయిస్తున్నాడు. ఈ సమయంలో మామిడి కాయల లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతోపాటు ఈ లక్ష్మణ్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మామిడికాయల లోడ్ లారీ డ్రైవర్ ఎన్.కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికుల సహాయంతో కుమార్‌ను లారీ క్యాబిన్ నుంచి వెలికి తీసి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న సఫాయి కర్మచారి జిల్లా పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ ఈనెల 29న జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చిల్లకూరు: మండలంలోని వరగలి క్రాస్ రోడ్డులోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం.. వైఎస్సార్ కాలనీకి చెందిన వలిపి రమణయ్య (57) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం గూడూరులో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో నాయుడుపేట నుంచి గూడూరు వైపు వస్తున్న బియ్యం పంపిణీ చేసే వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు గూడూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.